
# రెండో మార్గం

## కాశీవిశ్వనాథ్




"ఫ్లోప్"

కేక విని, రాస్తున్న కాగితాలని ఓ పక్కన పెట్టి లోపల గదిలోనించి శ్రీనివాస వర్మ హాల్లోకి వచ్చాడు.

నేల మీద పడున్న కవరుని అందుకున్నాడు. న్యూస్ పేపరును అడ్డంగా మడతపెడితే వచ్చే సైజులో ఆ కవరుంది. దాని మీద కె.ఆర్.నాయక్ బొమ్మ లైన్ డ్రాయింగ్‌లో వేశారు. ఆ బొమ్మ చుట్టూ కొంత మంది సినిమా ప్రముఖుల, రాజకీయ ప్రముఖుల బొమ్మ లున్నాయి. "అభినవ శ్రీకృష్ణ దేవరాయ, శ్రీ కె.ఆర్.నాయక్ గారికి కళా ప్రపూర్ణ బిరుదు లభించిన శుభ సందర్భాన అయనకున్న లక్షలాది అభిమానులు ఏర్పాటు చేసిన ఘనమైన అభినందన సభ" అనే అక్షరాలు కవరు నిండా రాసున్నాయి. కవరు విప్పి లోపలున్న ఆహ్వాన పత్రాన్ని చూడకుండానే దాన్ని చించేయబోయాడు.

"ఆగండి గురూ గారూ ఆగండి" అంటూనే శ్రీను లోపల కొచ్చి వర్మ చేతిలో నించి కవరు లాక్కున్నాడు. గబగబా దాని మీ దున్న బొమ్మల్ని చూసి, అక్షరాలు చదివాడు. "ఇది చాలా అన్యాయం గురూ గారూ! ఇంతమంది వి.ఐ.పీ.ల బొమ్మలున్న ఇంత పెద్ద కవర్ని; పైగా, కె.ఆర్.నాయక్ గారి అభినందన సభకి రమ్మని పంపించిన ఆహ్వానాన్ని చింపేయడానికి మీకు మనసెలా ఒప్పిందండీ?" అంటూనే కవరు విప్పి లోపలున్న కార్డు బైటికి తీశాడు.

వర్మ శ్రీనూని విసుగ్గా చూసి లోపలికి వెళ్లిపోయాడు.

ఆహ్వాన పత్రంలోని కార్యక్రమాల్ని చదువుతున్న శ్రీనూ, మెరుస్తున్న ఆకుపచ్చ రంగు సిరాతో రాసిన అక్షరాలని చూసి నివ్వెరపోయేడు. "ఒరేయ్ వర్మా! నా అభినందన సభలో నిన్నో ఓ ఉపన్యాసకుడిగా వేశాను. నువ్వు తప్పకుండా రావాలి సుమా" అనే అక్షరాల కింద గులాబీ రంగు సిరాతో కె.ఆర్.నాయక్ సంతకం ఉంది.

వర్మ పాతికేళ్లకిపైగా సినిమా రంగంలో సహకార దర్శకుడి హోదాలో పనిచేస్తున్నాడు. అతని సాయంతోనే శ్రీను నాలుగేళ్ల క్రిందట అసిస్టెంట్ డైరెక్టర్ ఉద్యోగం సంపాదించుకున్నాడు. వర్మ చాలా తెలివైన వాడని చాలా మంది ఒప్పుకున్నారు. అతనికి డైరెక్షన్ అవకాశం. ఇస్తే తప్పకుండా విజయం సాధిస్తాడని ఇంకా చాలా మంది ఒప్పుకున్నారు. అయినా, అతన్ని డైరెక్టర్ని చెయ్యడానికి మాత్రం ఏ ఒక్కరూ ఒప్పుకోలేదు. ఈ విషయం శ్రీనూకి తెలుసు!

ఆంధ్ర దేశంలో అన్నవరం గురించి, అమరావతి గురించి తెలియని వా రున్నారేమో గాని, విశ్వకళామయి సాంస్కృతిక సంస్థ గురించి తెలియని వా రుండరు. అలాంటి వారు ఒకటి, అరా ఉన్నా వాళ్ళు కొత్తగా ఆంధ్ర దేశానికి వలస వచ్చిన వాళ్లే అయి ఉంటారు తప్ప, ఆంధ్రాలో పుట్టి పెరిగిన వాళ్లై ఉండరు. ప్రతీ ఏటా భారీ ఎత్తున సినిమా ఫంక్షన్ నిర్వహించడం, దానికి భారీ సినిమా మనుషుల్ని భారీ రాజకీయ ప్రముఖుల్ని ఆహ్వానించడం వల్ల ఆ భారీ సంస్థ గురించి అందరికీ భారీగానే తెలుసు. అటువంటి ప్రముఖుల సమక్షంలో సినిమా అవార్డుల కమిటీ ఎంపిక చేసిన నటీ నటులకి అవార్డులు ఇస్తారు. రాష్ట్ర ప్రభుత్వం చేత నంది అవార్డులు అందుకోవడం కంటే, విశ్వమయి కళా సంస్థ వారిచ్చే అవార్డు అందుకోవడమే గొప్పగా, ఘనతగా భావించే స్థాయికి పాపులారిటీని సంపాదించుకుంది.

గత పదేళ్ల నించి నాటక పరిషత్తులు నిర్వహించి, విజేతలకి ఆంధ్ర దేశంలోని మరే నాటక పరిషత్తు వారు ఇవ్వనంత నగదు బహుమతు లందిస్తోంది. సినిమా, నాటక రంగాలతోపాటు, ఈ మధ్య టీ.వీ. సీరియల్స్‌కు కూడా అవార్డులివ్వటం ఆరంభించింది. ఆ సంస్థ గొప్పతనం గురించి వర్ణిస్తూ, ఓ సినిమా కవి -"యావత్ ప్రపంచానికీ ఒకే ఒక్క నయాగరా, యావత్ ఆసియా ఖండానికీ ఒకే ఒక్క హిమాలయం, యావత్ భారతదేశానికీ ఒకే ఒక తాజ్‌మహల్, యావత్ ఆంధ్ర దేశానికీ ఒకే ఒక్క విశ్వ కళామయి సంస్థ! భారతదేశ స్వాతంత్ర్యం గురించి చెప్పేటప్పుడు గాంధీ గురించి చెప్పకపోయినా, ప్రత్యేకాంధ్ర రాష్ట్రం గురించి చెప్పేటప్పుడు పొట్టి శ్రీరాములు గురించి చెప్పకపోయినా చరిత్ర నను క్షమిస్తుందేమోగాని, విశ్వ కళామయి లాంటి విఖ్యాత సంస్థ గురించి చెప్పేటప్పుడు, దానికి రంగు, రుచి, వాసన కల్పించి, కర్త, కర్మ, క్రియగా మారిన కె.ఆర్.నాయక్ గురించి చెప్పకపోతే ఆంధ్రదేశం నన్ను క్షమించదు. నటరాజు అంతకంటే క్షమించడు" అంటూ చాలా ఆవేశపడిపోయాడు.

అటువంటి సంస్థ నించి ఆహ్వానం రావడం ఒక విశేషం. రాకపోవడం ఓ దురదృష్టమని శ్రీను అభిప్రాయం. వర్మ లాంటి ఓ అనామిక సహకార దర్శకుడుకి ఆహ్వాన పత్రాలు రావడం అతనికి ఆశ్చర్యం కలిగించింది. అంతకుమించిన ఆశ్చర్యమేమిటంటే, వాటిని వర్మ ఏనాడూ ఖాతరు చేయకపోవడం! కారణం ఏమిటని ఈ నాలుగేళ్లలో ఓ నాలుగు సార్లయినా అడిగి ఉంటాడు. అడిగిన ప్రతీసారి వర్మ తన అయిష్టతను, చిరాకునే సమాధానం చేశాడు తప్ప, నోరు విప్పి జవాబు చెప్పలేదు. ఇప్పు డొచ్చిన ఆహ్వానపత్రంలో నాయక్ అంతటి వాడు వర్మని ఆహ్వానిస్తూ స్వదస్తూరీతో రాశాడు. ఇది వర్మ చూడలేదు. చూస్తే ఏమంటాడో ననుకుంటూనే శ్రీను, వర్మ గదిలోకి వెళ్లాడు.

వర్మ మంచం మీద పడుకుని, రెక్కల పురుగులా గుయ్యిమంటూ శబ్దం చేస్తూ తిరుగుతున్న సీలింగ్ ఫేన్ వైపు చూస్తున్నాడు.

"గురూ గారూ! ఈ ఆహ్వానాన్ని చించేయబోయేరేం?" మెల్లగా అడిగాడు శ్రీను.

"చింపక, ముఖానికి కట్టుకుని

తిరగమంటావా?'' తల తిప్పకుండానే వర్మ జవాబు చెప్పేడు.

"అది కాదండి! మీరు లోపలున్న కార్డు చూడలేదు. నాయక్ గారు మిమ్మల్ని తప్పకుండా వచ్చి, ఉపన్యసించాలని రాశారు'' అంటూ కవరులో నించి తీసిన కార్డుని అతని ముఖానికి దగ్గరగా ఉంచాడు. వర్మ కళ్లు ఆ మాటల్ని చదివినా, అతని ముఖంలో ఎటువంటి స్పందనా కనిపించలేదు.

శ్రీనూ మరేం మాట్లాడకుండా వంట గదిలోకెళ్లి ఓ కప్పు కాఫీ తీసుకొచ్చి వర్మకి అందించాడు. "వదినగారు ఊళ్లో లేరు గదా. మీరు కాఫీ చేసుకోవడానికి బద్దకించి ఉంటారని నేనే కలిపి తీసుకొచ్చేను.''

వర్మ కాఫీ తాగుతున్నా మూడ్‌లో మాత్రం మార్పు రాలేదు. మళ్లీ శ్రీను తన అభ్యర్థనని వినిపించడానికి ప్రయత్నించాడు. "ఇంతకీ నేను చెప్పొచ్చేదేమిటంటే, తెలుగు వాడు కాని నాయక్ గారు తెలుగు సాంస్కృతిక రంగాని కింత సేవ చేసి, యూనివర్సిటీ చేత కళా ప్రపూర్ణ బిరుదు...''

వర్మ చూసిన చూపుకి శ్రీను నోరు ఠక్కుమని మూసుకుంది.

"వాడు తెలుగు వాడు కాదని నీ కెవడు చెప్పేడు?'' వర్మ సీరియస్‌గా అడిగాడు.

"తెలుగు వాడైతే, పేరు కె.ఆర్.నాయక్ అని...''

"వాడి పూర్తి పేరు కేదారిశెట్టి రంగనాయకులు. దాన్నే కె.ఆర్.నాయక్‌గా మార్చుకున్నాడు. వాడి గురించి నువ్వు నాకు చెప్తావేమిటి?'' అంటూ ఖాళీ కప్పు పెట్టేసి, స్నానం చెయ్యడానికి బాత్‌రూమ్ కెళ్లాడు. నాయక్ పక్కా తెలుగు వాడని తెలుసుకోవడం కంటే, వాడి గురించి నాకు బాగా తెలుసన్న మాట శ్రీనూకి మరింత ఆసక్తిని కలిగించింది. ప్రముఖులతో స్నేహం పొందడం ఓ గొప్పయితే, ఓ ప్రముఖుణ్ణి ఓ సామాన్యుడు చీదరించడం మరీ గొప్ప విషయం కాబట్టి, ఇవాళ ఆ సంగతేమిటో తేల్చెయ్యా లనుకున్నాడు.

స్నానం చేశాక వర్మ శరీరంతోపాటు మనసు గూడా చల్లబడినట్టుంది; ఇందాకటి కంటే ఇప్పుడు చాలా ప్రశాంతంగా, ప్రసన్నంగా కనిపించాడు. శ్రీను తన కుతూహలాన్ని బైట పెట్టాడు. కానీ - "ఆ సంగతులన్నీ ఇప్పు డెందుకు లేరా! పది రోజుల్నించి హొటల్ తిండి తినలేక చస్తున్నాను. ఈ పూట వంట చేసుకోవాలి'' అంటూ వంట గది వైపు నడవబోయేడు. శ్రీనూకి మంచి అవకాశం దొరికి నట్టయింది. అతను వంట్స బాగా చెయ్యగలడు. ఆ విషయం వర్మకీ తెలుసు. "గురూ గారూ! ఇవాళ నా చేతి వంట మీకు రుచి చూపిస్తాను. నాకు మీరు థాంక్స్ చెప్పడానికి బదులుగా మీకు నాయక్ గారితో ఉన్న పరిచయం గురించి చెప్పాలి'' అన్నాడు. వర్మ అంగీకార సూచకంగా చిన్న నవ్వు నవ్వి సిగరెట్ వెలిగించాడు. శ్రీను లోపల కెళ్లి కత్తిపీట, కూరగాయలు తీసుకొచ్చి, నేల మీద కూర్చుని తరుగుతూ'' ఇక చెప్పండి గురూగారూ!'' అన్నాడు. వర్మ మంచం మీద వెనక్కివాలి కూర్చుని చెప్పనారంభించాడు.



## వింత వీలునామా

లండన్‌లో ఒక ఆసామీ తన భార్య గయ్యాళితనం భరించలేక 19వ శతాబ్దంలో చనిపోతూ ఒక వింత వీలునామా రాశాడు. అది ప్రతి సంవత్సరీకంనాడూ, చెప్పుల్లేకుండా ఒక కొవ్వొత్తిని చేతిలో పట్టుకుని లోకల్ మార్కెట్‌కి వెళ్లి అక్కడ పెద్దగా గొంతెత్తి 'నేను ఇన్ని బాధలు పెట్టకపోతే నా భర్త ఇంకా కొన్ని సంవత్సరాలు బతికి ఉండేవాడు' అని చెప్పాలి.

అలా చెప్తేనే ఆస్తి ఆమెకు చెందుతుందని వీలునామా రాశాడు.

సేకరణ: ముద్దా రమణమూర్తి
(అనంతపురం).

"రంగనాయకులు గాడిది మా ఊరే! అయస్కాంతానికి ' ఇనుము తప్ప బంగారం అంటనట్టు, వాడికి చదువు తప్ప మిగతా చిల్లర వ్యవహారాలు అబ్బేయి. ఎవడి బుర్ర మీదో చెయ్యేసి, ఓ పదో పాతికో సంపాదించి పేకాటకి కూర్చునే వాడు. వాడి చెయ్యి ఏ మంచి పనికీ ఉపయోగపడకపోయినా, పేకాటలో గెలిపించడానికి ఉపయోగపడేది. ఎక్కువ డబ్బులొస్తే బ్రాందీ తాగేవాడు. మరీ చిల్లర డబ్బులే ఉంటే సారాతో సరిపెట్టుకునేవాడు. నేను మా ఊళ్లో ఉన్నప్పుడు వాడి పరిస్థితి ఇదే!

"నేను మద్రాసొచ్చేసిన అయిదు సంవత్సరాలకి ఓ తెల్లారు జామున నా ఇంటి కొచ్చేశాడు. 'ఏవిట్రా ఏం జరిగింది? ఉత్తరం పత్రం లేకుండా ఊడిపడ్డావ'ని అడిగితే వాడు నిజమే చెప్పేడు. వాడి ఆలోచనలు చెడ్డవైనా అబద్ధాలు మాత్రం చెప్పేవాడు కాదు. మా ఊళ్లో నాయుడు గారనే కోటీశ్వరు డున్నాడు. ఆయన కూతురు విధవరాలిగా మారి పుట్టింట్లోనే ఉంటే వీడు ఆ అమ్మాయి కోసం లైన్ వేశాడట. ఆ అమ్మాయిని కట్టుకుంటే నాయుడి గారి ఆస్తంతా తన కొస్తుందన్న ఆశతోనే ఆ పని చేశాడట. కానీ, ఆ విషయం తెలిసిన నాయుడుగారు రౌడీల్ని పంపించి వీడి కాలూ చెయ్యీ తీయించెయ్యబోతుంటే, వీడు తప్పించుకుని, సరాసరి నా ఇంటికి పారిపోయొచ్చేడట. వాడికి చీవాట్లు పెట్టి, ఇక మీదటయినా జాగ్రత్తగా ఉండమని చెప్పి, మా డైరెక్టర్ గారికి చెప్పి, అసిస్టెంట్ డైరెక్టరుగా కుదిర్చాను.

"ఏదో మొక్కుబడి కొద్దీ మా వెంట స్టూడియోల కొస్తున్నాడే గాని, వాడి ధ్యాస మాత్రం పని మీద ఉండేది కాదు. ప్రొడ్యూసర్ల కార్ల మీద, వాళ్లు బ్రీఫ్ కేసుల్తో తెచ్చే డబ్బు మీదే వాడి దృష్టి ఉండేది. ఓ ఆరునెల్లు అలా ఇలా గడిపాక, నన్నో రాత్రి బార్‌కి తీసుకెళ్లి, మొదటి పెగ్గు తాగుతూ "ఒరేయ్ వర్మా! ను వ్విక్కడ అసోసియేట్ డైరెక్టరుగా బతుకుతున్నావంటే, నీకు నెలకి యాభై అరవై వేలయినా వస్తుందా లనుకున్నాను గాని, అదేమీ లేదని తెలిసిపోయింది. ఇక్కడ చాలా మంది, నీ తెలివి తేటల్ని పొగడ్డం విన్నాను. కానీ, ఎవడూ నీకు డైరెక్షన్ ఛాన్స్ ఇవ్వడంలేదు. నువ్వూ ఈ ఉద్యోగంలో రాత్రింబగళ్లూ కష్టపడ్డమే తప్ప పెద్దవాడి వవడానికి ఏమీ కృషి చేయడంలేదు. అంచేత నేను తీయబోయే పిక్చర్‌కి నీకు డైరెక్షన్ ఛాన్సు ఇస్తున్నాను. నాకు థాంక్సు చెప్పరా'' అనేసరికి నాకు ఆశ్చర్యమేసింది.

"ఒక్క పెగ్గుకే ఈ తాగుబోతు ప్రేలాపన ఏవిట్రా'' అంటూ కసిరాను. తనవి తాగుబోతు మాటలు కావని చెప్పి జేబులో నించి ముప్పై వేలు తీసి చూపించాడు. అందరూ కొత్త నటీ నటుల్ని పెట్టి సినిమా తీయదలిచానని, వేషాలు కావలసిన వాళ్లందర్నీ డబ్బు పెట్టుబడి పెట్టమంటున్నానని చెప్పేడు. వచ్చే నెల్లో మరో లక్ష దాకా పోగేస్తానని చెప్తుంటే నేను సహించలేకపోయేను. వాడు ఇక్కడకొచ్చి ఆరు నెల్లు కూడా అవలేదు. అప్పుడే సినిమా తీసే ప్రయత్నాల్లోకి దిగిపోయేడు. అది కూడా ఆర్టిస్టులకి వేషా లిస్తానని డబ్బు దండే పద్ధతిలో! నా ఇంట్లో ఉంటూ, నాకు తెలియకుండా ఇలాంటి దగుల్బాజీ పని తలపెట్టినందుకు వాడిని చెడామడా కడిగేశాను. రే పాడబ్బు ఎవరది వారికిచ్చేస్తే తప్ప ఇంట్లోకి అడుగుపెట్టనివ్వనని కూడా వార్నింగ్ ఇచ్చేను.

"మర్నాడు వాడు నా ఇంటికి రాలేదు. బహుశా డబ్బుని వాపస్ ఇచ్చే పనిలో తిరుగుతున్నా డనుకున్నాను. మూడో రోజూ వాడు రాలేదు గాని, వాడి నించి ఓ ఉత్తరం వచ్చింది. అందులో ఏం రాశాడో నా కిప్పటికీ గుర్తే!

"ఒరేయ్ వర్మా! నీకు తెలివితేట లున్నాయి. కానీ .వాటికి నువ్వు సంతృప్తి అనే గంతలు కట్టేశావ్. అందుకే వాటికి నడుస్తున్న తోవ తప్ప రెండో మార్గం కనబడ్డంలేదు. మనం ఇంత తిని బతికేస్తూ ఇదే గొప్ప బతు కనుకుంటే మనకి పశువులకీ తేడా ఏం ఉంది? పశువు ఎంత కష్టపడి పని చేసినా దానికి దక్కేది మేత ఒక్కటే! నువ్వూ గొడ్డులా పనిచేస్తావ్. అందువల్ల కడుపు కింత తిండి దొరుకుతుందేమోగాని, డబ్బు, కీర్తి, హోదా,. ప్రతిష్ఠల్లాంటివి కలగడంలేదు. నా మార్గంలోకి నిన్ను లాగుదా మనుకున్నాను. కానీ నువ్వు నిల్చున్న చోటే నీ కాళ్లని తుమ్మబంకతో అంటించేసుకున్నావ్. నేను ఇంకా నీ దగ్గర ఉంటే, నీ గంతల్ని నేను విప్పలేకపోగా, నాకు నువ్వు గంతలు కట్టేసే ప్రమాదం ఉందనిగ్రహించేను. అందుకే వెళ్లిపోతున్నాను'' అని రాశాడు. ఎక్కడికి వెళ్తున్నాడో రాయలేదు.

"కొన్నాళ్ల తర్వాత విశ్వకళామయి సంస్థ నించి ఎవరో కె.ఆర్.నాయక్ నాకు ఆహ్వాన పత్రాలు పంపనారంభించాడు. ముప్పై వేలతో పరారైపోయిన రంగనాయకులు గాడే ఇలా, కె.ఆర్.నాయక్‌గా అవతార మెత్తాడని నేను పర్ పెర్సెంట్ గూడా ఊహించలేకపోయేను. ఎవడో స

న్నెరిగిన వాడు ఆ సంస్థలో ఉంటూ నాకూ ఓ కార్డు పోస్టులో తోసేస్తున్నా డనుకున్నాను. ఇంకా సంస్థ ఎలాం టెలాంటి కార్యక్రమాలు నిర్వహించి, ఎంత పెద్ద స్థాయికి వెళ్లిందో నా కంటే నీకే ఎక్కువ తెలును. అయితే, ఆ సంస్థ ఇచ్చే అవార్డుల గురించే నీకు తెలును. కానీ, ఆ అవార్డుల వెనుకున్న బాగోతం ఏవిటో నేను తెలుసుకున్నాను.

"ఎమ్మన్' అనే పేరుతో ఓ కమేడియన్ కమ్ కేరక్టర్ ఏక్టర్ ఒకాయన పది పదిహేనేళ్ల క్రితం ఓ వెలుగు వెలిగాడులే! పాత సినిమాల్లో నువ్వు చూసే ఉంటావు. అతన్నాకు మంచి స్నేహితుడు. అతనికి నాయక్ గాడి సంస్థ ప్రతీ ఏటా ఏదో ఒక అవార్డులిచ్చేది. ఓసారి ఉత్తమ హాస్య నటుడని ఇస్తే, మరోసారి బెస్ట్ కేరక్టర్ యాక్టరని, ఇంకోసారి ఉత్తమ సంచలన నటుడని, ఇవేవీ కాకపోతే ఉత్తమ గెస్ట్ ఆర్టిస్ట్ పాత్రధారి అని... ఇలా అవార్డుల పేరు మారేది తప్ప, అతనికి ఎవార్డు మాత్రం తప్పేది కాదు. అతను ప్రతిభావంతుడైన నటుడే గాని, ప్రతిభని మించిన ప్రచారాన్ని కోరుకునే మనస్తత్వం ఆయనకుంది. మరి, ఆయనకి అవార్డులూ అలాగే వచ్చాయి.

"సరే, ఈ సినిమా రంగం సంగతి నీకీ పాటికి కొంత వరకైనా అర్థమయే ఉండాలి. ఏడంతస్తుల మేడ మీదున్న వాడు ఏమీ లేకుండా రోడ్డు మీద పడిపోవడానికి, కాళ్లకి చెప్పులు కూడా లేకుండా ఇక్కడికొచ్చిన వాడు పరిశ్రమని చెప్పుచేతల్లో పెట్టుకోవడానికి ఎక్కువ టైము పట్టదు. నేను రెండు రకాల మనుమల్ని చూశాను. కొత్త నీరొచ్చి పాత నీటిని కొట్టేసినట్టుగా కొత్త నటులొచ్చి ఎమ్మన్‌ని మూలకి నెట్టేశారు. ఎమ్మన్ కాల్‌షీట్ ఓ రెండు గంటలు దొరికితే చాలని నిర్మాతలు అతని కోసం ఎగబడ్డమూ ఈ కళ్లతో చూశాను. రెండు సంవత్సరాలపాటు ఆయన ఆయనకి మేకప్ పడకపోవడమూ ఇదే కళ్లతో చూశాను. రెండు సంవత్సరాల తర్వాత ఆయనకో సినిమాలో వేషం వచ్చింది. ఆయనా అద్భుతంగా నటించాడు. రాష్ట్ర ప్రభుత్వం నంది ఎవార్డు కూడా ఇచ్చింది.

"కానీ, నాయక్ గాడి సంస్థ ఆ సంవత్సరం ఆయనకి ఎటువంటి అవార్డూ ఇవ్వలేదు. ఇవ్వలేకపోతేమానె.లుగురికీ పంపినట్టు అతనికి ఆహ్వానపత్రం కూడా పంపలేదు. నే నోసారి ఆయన్ని కలిసి 'ఆ సంస్థ మీకు చిన్న అవార్డు' కూడా ఇవ్వకపోవడం చాలా అన్యాయం సుమండి' అన్నాను. ఆయన బాధపడతా డనుకున్నాను గాని, అలాంటి పనేమీ చెయ్యకుండా పకపకమంటూ నవ్వేడు.

"వర్మ గారూ! మీ అమాయికత్వం గాని, ఆ నాయక్ గాడు నా కెప్పుడు మాత్రం అవార్డిచ్చేడండీ? ప్రతీ ఏటా, వాడా అవార్డుని పదివేల రూపాయలకి అమ్మేవాడు. నేను కొనేవాణ్ణి. నే నేవిటి లెండి. ఆ సంస్థ ద్వారా అవార్డందుకున్నవాళ్లలో నూటికి తొంభై మంది నాలాంటి బేరగాళ్లే! నాకిప్పుడు బోణీల్లేవు పొజిషన్ దెబ్బతినేసింది గదా! నా రోజు ఖర్చే నాకు ఇబ్బందిగా ఉంది. అలాంటప్పుడు పది వేలిచ్చి నే నేం అవార్డు కొనుక్కోగలను? ఒకవేళ, ఈ అవార్డుల కోసంఇప్పుడు ఎగబడినా, ఇవి పైనున్న వాణ్ణి మరికొంచెం పైకెత్తడానికి పనికొస్తాయ్‌గాని, చతికిలబడిపోయిన వాణ్ణి మళ్లీ లేవడానికి పనికిరావు."

"ఎమ్మన్ తన మనసులోని మాటని మర్మం లేకుండా చెప్పేక, నా మనసులో నిలువుకున్న అభినవ శ్రీకృష్ణ దేవరాయలి నిలువెత్తు కటౌట్ సగానికి సగం విరిగిపోయింది.

"మిగిలిన సగం ఎలా తిరిగిపోయిందంటే

ఓసారి ఆ సంస్థ నిర్వహించిన నాటక పోటీల్లో ఉత్తమ ప్రదర్శన బహుమతి గెల్చుకున్న బరంపురం టీము వాళ్లు, అక్కడ ఫంక్షన్ అయిపోయాక సరదాగా ఇక్కడ జరిగే షూటింగులు చూడ్డానికొచ్చేరు. చూశారు. చూశాక, 'మాకూ ఏవైనా వేషాలుంటే ఇవ్వండీ' అన్నారు. అయితే అప్పుడు మేం హీరో హీరోయిన్లుండే సీన్స్ మాత్రం తీస్తున్నాం. 'కోర్టు సీన్స్, హాస్పిటల్ సీన్స్ మరో నాలుగు రోజులు తర్వాత ఉంటాయి కాబట్టి, అప్పుడు రండి' అన్నా న్నేను. మద్రాసు నుంచి బరంపురం వెళ్లి, తిరిగి రావడమంటే అది చాలా కష్టమైన ప నన్నారు. 'అయితే ఈ నాలుగు రోజులూ ఇక్కడే ఏదైనా లాడ్జీలో ఉండండీ' అన్నాను. బిక్కు బిక్కుమని చూస్తూ "అంత డబ్బు మా దగ్గర లేదు సార్" అన్నారు.

నేను ఆశ్చర్యపోయి "అదేవిటండీ? విశ్వకళామయి సంస్థ వాళ్లు నాటకాల్లో ఉత్తమ ప్రదర్శన ప్రైజు పొందిన వారికి అయిదు వేల నూట పదహార్లు నగదు బహుమతి, వెయ్యి రూపాయలు విలువ చేసే షీల్డు ఇస్తుంటారని విన్నాను. మీ కొచ్చిన డ బ్బంతా అప్పుడే ఖర్చు పెట్టేశారా?" అన్నాను. దానికి వా ళ్లిచ్చిన సమాధాన మేమిటో తెలుసా?

"ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ ఆరంభమవుతుందనగా నాయక్ గాడు మైకు పట్టుకుని, మద్రాసులో ఆర్డరిచ్చిన, షీల్డులు సమయానికి అందకపోవడం వల్ల వాటిని ఇవ్వలేకపోతున్నామని చెప్పి చాలా విచారించేశాడు. అయితే ఔత్సాహిక నటులకి సినిమా ప్రముఖులతో ఫోటోలు తీయించుకోవాలనే కుతూహలం ఉంటుంది గాబట్టి, మా దగ్గరున్న పాత షీల్డుని ముఖ్య అతిథిగారు విజేతల కిస్తున్నట్టుగా ఫోటోలు తీయించే ఏర్పాటు చేశానని చెప్పేడట. అసలు షీల్డుల్ని రిజిస్టర్ పార్సెల్ ద్వారా పంపిస్తా న న్నాడట. ఇంక నగదు బహుమతీ అంటూ వేదిక మీద వీళ్లకి ఓ కవరు ఇప్పించేడట. అయితే అందులో పచ్చకాగితాలకి బదులు ఓ తెల్లకాగితం ఉందట. అందు మీద -'తర్వాత కలవండి' అని రాసుందట!


"నాయక్ గాణ్ణి తర్వాత కలిస్తే "చందాలు ఇస్తామన్న వాళ్లు టైమ్‌కి ఇవ్వలేదు. అందరూ పెద్దవాళ్లే. ఎవర్నీ ఒత్తిడి చేయలేంగా. వాళ్లు నాకివ్వగానే నేను మీకు డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపిస్తాన"ని చెప్పి హడావిడిగా వెళ్లిపోయేడట. ఊర్లో నాయక్ గాడి నాటకాలు బాగా తెలిసిన పెద్ద వాళ్లు కొంతమంది, ఈ అమాయికుల దగ్గరకొచ్చి - "కొత్త నాటక సమాజాల వార్ని ప్రోత్సహించాలని పెధవ కబుర్లు చెప్పి మీలాంటి కొత్త వారికి ప్రైజు లిస్తుంటాడు. డబ్బుని తర్వాత డి.డి ద్వారా పంపిస్తామని చెప్పడమే తప్ప, ఇన్నేళ్లలో వాడు ఏనాడూ ఎవరికీ డబ్బు పంపడం మేం చూళ్లేదూ" అన్నారట."

వర్మ చెప్తూ చెప్తూ మంచినీళ్లు తాగడానికి కాస్సేపు ఆగేడు.

శ్రీనుకి ఇదంతా విచిత్రంగానూ, అయోమయంగానూ కనిపిస్తోంది. నాయక్ గురించి తను వినడానికి, ఇప్పుడు వింటున్న దానికి ఎక్కడా పొంతన కనబడ్డంలేదు. నీళ్లు తా గచ్చి వర్మ మళ్లీ మంచం మీద కూర్చున్నాడు.

"సరే! గురూగారూ! మీ రంగనాయకులే ఈ కె.ఆర్.నాయక్ గాడని మీ కెప్పుడు తెల్సింది? తెలిశాక మీరు అతన్తో ఎప్పుడైనా మాట్లాడారా?" శ్రీను చాలా ఆసక్తిగా అడిగాడు.

"ఆ దురవస్థ నాకు దాపురించిందిరా! గత ఏడాది మేం ఔట్‌డోర్ షూటింగ్ కోసం ఆ నాయక్ గా డుండే ఏరియాకే వెళ్లాం. అప్పుడు వాడే షూటింగ్ దగ్గరకొచ్చేడు. మా ప్రొడ్యూసర్, డైరెక్టరు షూటింగు ఆపి మరీ ఆయన్తో మాట్లాడ



నారంభించారు. వాడు రంగనాయకులు గాడేనని నేను గుర్తు పట్టిందీ అప్పుడే! వాడు నల్ల కళ్లద్దాలు పెట్టుకున్నాడు. నేనూ చాలా దూరంగా నిలబడ్డాను కాబట్టి వాడు నన్ను చూడలేదనుకున్నాను. కానీ వాడు చూశాడు, నన్ను గుర్తు పట్టేడు కూడా! అయినా నన్ను పలకరించకుండా తిన్నగా వెళ్లి కారులో కూర్చొని, డ్రైవర్ని నా దగ్గరికి పంపించాడు. రాత్రి ఏడు గంటలకి మా అయ్యగారు మిమ్మల్ని తమ ఇంటికి రమ్మన్నారండి! నేను మీ లాడ్జింగ్ కొచ్చి మిమ్మల్ని తీసుకువెడతా నన్నాడు డ్రైవరు. వా డింటికి వెళ్లడమా, మానడమాని ఆలోచిస్తూనే, ఆ రాత్రి వా డింటికెళ్లాను.

"వాడి పేరు ప్రతిష్ఠలకి తగ్గట్టే ఇల్లూ ఉంది. తన హోదాని తెలియజేసే విధంగా స్కాచ్ విస్కీ సీసా ఒంపాడు. కాస్సేపు పొడి పొడిగా ఏవో మాటలు జరిగాయి. పాతిక సంవత్సరాల కాలం వాడి పేరుని మార్చింది, రూపాన్ని మార్చింది, అంతస్తునీ మార్చింది గాని, డబ్బు సంపాదన విషయంలో వాడు 'స్వయంశక్తి'తో రూపొందించుకున్న సిద్ధాంతాన్ని మాత్రం అవగింజంత కూడా మార్చలేకపోయింది. మా మాటలు అటు తిరిగి, ఇటు తిరిగి, తిన్నగా మా జీవితాల దగ్గరకొచ్చి ఆగినప్పుడు, వాడేమన్నాడు తెల్సునా?

"ఒరేయ్ వర్మా! నా సిద్ధాంతాల్లో మార్పు రాలేదని ను వ్వనుకుంటున్నావు. అలాగే, నీ సిద్ధాంతాల్లో మార్పు రాలేదని నేనూ బాధపడుతున్నాను. సరే, ఇప్పుడు నే నో ప్ర శ్నడుగుతాను చెప్పు. నీ పద్ధతి గొప్పదా? నా పద్ధతి గొప్పదా? పాతికేళ్ల క్రితం ను వ్వెవరివి? సాధారణమైన సహకార దర్శకుడివి. ఇప్పుడు? ఇప్పుడూ అంతే! కానీ - నేను? పాతికేళ్ల క్రితం పోరంబోకుని, బేవార్సుని, అనామకుణ్ణి! కానీ - ఇప్పుడు? లలితకళలకి బంధువుని, అభినవ శ్రీకృష్ణదేవరాయ బిరుదు పొందిన వాణ్ణి! ఇం కొద్ది రోజుల్లో కళాప్రపూర్ణుడిని కూడా కాబోతున్నాను. ఆ తర్వాత నేను పద్మశ్రీనై పోయినా ఆశ్చర్యంలేదు. మ నిద్దరి మధ్య ఇంత తేడా ఎందు కొచ్చింది? నీ తెలివి తేటలకి గంతలు కట్టి గానుగెద్దుల్లా తయారు చేశావు కాబట్టి, అవి అక్కడికక్కడే తిరుగుతున్నాయని అనాడే చెప్పేను. కానీ, నేను నా తెలివితేటల్ని రెచ్చగొట్టి, రెక్కలు కట్టి ఆంధ్ర రాష్ట్రం మీద కదిలేశాను.

"నా చర్మ సౌందర్యానికి ఫలానా సబ్బే కారణమని సినిమా తారలు చెప్పినట్టు, నా అభివృద్ధి వెనకనున్న అసలు రహస్యం నీకు చెప్పేస్తాను. కష్టపడి పని చేయడం, డబ్బు, కీర్తి సంపాదించడం అనేవి రాజమార్గంలో సాధ్యమవుతాయి. కానీ, ఆ మార్గం పదివేల మీటర్ల పరుగులాంటిది. అంత దూరం పరుగెత్తాలంటే చాలా దమ్ము కావాలి. నా బోటి పేరులో కొచ్చిన ప్రముఖుల్ని పట్టుకుని, వాళ్లని అడ్డం పెట్టుకుని మనం పేరులోకొచ్చెయ్యడం! అందుకు ప్రజలకి బాగా తెల్సిన వాళ్లనే పట్టాలి. అలాంటి వా ళ్లెవరుంటారు? ఒకటి సినిమా వాళ్లు, రెండు రాజకీయ నాయకులు!



## శాంతిదూత రవీనా !

శాంతి సామరస్యాలలో రవీనా టాండన్‌కు ఈ దశాబ్దంలో మేటి అవార్డు ఇవ్వొచ్చు. సంజయ్‌కపూర్ గర్ల్ ఫ్రెండ్, మోడల్ కూడా అయిన మహీప్ సంధూ అనే అమ్మాయి. ఇటీవల రవీనాను నిఘంటువులో పదాలు వెతికి .మరీ తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టేసిందిట. అయినా రవీనా చిరునవ్వు చెరగనివ్వకుండా "మహీప్ చాలా మంచి పిల్ల. కాని ఇలాంటి మాటలు మాట్లాడి ఉండకూడదు" అంటూ సౌమ్యంగా చెప్పింది. రవీనా స్టేట్‌మెంట్ చూసి మహీ ఏం చేయాలో తెలియక తెల్లబోయిందట. ఏం చేస్తుంది మరి?

మసూద్ అన్సారి

---

"బంతిలో గాలి ఉంటే తప్ప అది పైకి ఎగరలేదు. అలాగే సినిమా వాళ్లకి పబ్లిసిటీ ఉంటే తప్ప వాళ్లకి గ్లామరు, ఫాలోయింగ్ ఏర్పడదు. అందుకే నేను భారీ ఎత్తున సభలు పెట్టేను. దిమ్మతిరిగిపోయే సన్మానాలు చేయించేను. నోరు తిరగలేనంత కఠినమైన మాటల్తో గూడిన బిరుదు లిచ్చేను. ఎవరూ ఇవ్వని అవార్డులిచ్చేను వాళ్లకి ఊపిరి తిరగనంతగా పబ్లిసిటీ ఇచ్చేను. అది కూడా పేరులో ఉన్న వాళ్లకే మరింత పే రొచ్చే విధంగా పబ్లిసిటీ ఇచ్చేను.

"బూజు పట్టిన వాళ్లకి, మూలపడిన వాళ్లకి మనం ఎంత చేసినా, అది కన్నం ఉన్న బంతికి గాలి కొట్టినట్టే అవుతుంది. ఆ మ ధ్యెవరో పెద్దాయన ఆర్థికంగా చితికిపోయి, చావలేక బతుకుతున్న కొంతమంది కళాకారుల పేర్లు ఇచ్చి 'వాళ్లకి మీ సంస్థ ద్వారా ఆర్థిక సాయం చేయండి, మీకు పుణ్యం దక్కుతుం ద'న్నాడు. నాకు చచ్చిన తరావత వచ్చే పుణ్యం కంటే బ్రతికుండగా వచ్చే పబ్లిసిటీయే ముఖ్యమని భావించాను. నా సంస్థను అంతర్జాతీయ సంస్థగా మార్చాలనుకుంటున్నానే గాని, అభాగ్యుల్ని ఆదరించే కరుణా సమాజంగా మార్చదల్చుకోలేదు.

సరే! నే నింత భారీ ఎత్తున ఇన్ని కార్యక్రమాలు చేసినా, నా చేతి సొమ్ము పైసా కూడా ఖర్చవలేదంటే నువ్వు నమ్ముతావా? అంతా ఆ సినిమా వాళ్ల దగ్గర్నుంచే వసూలు చేశాను. వాళ్లని చూపించి ప్రజల దగ్గర వసూలు చేశాను. ఇంక రాజకీయ నాయకుల సంగతి! పాపం వాళ్లు, అయిదేళ్లపాటు ప్రజాసేవ చేస్తామని ప్రమాణం చేసి, పదవుల్లో కొచ్చినా, వాళ్ళ పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కు లాంటిదని ప్రతీ మంత్రికీ తెలును. అందుకే వాళ్లు శాసనసభలకైనా ఎగ్గొడతా రు గాని, వాళ్లకి చేసే సన్మానాలకిమాత్రం దూరంకారు. మంత్రులు వస్తే కలెక్టర్లు, మిగతా విఐపీలు ఆటో మేటిగ్గా వస్తారు. వీ ళ్ళందరూ వచ్చినప్పుడు పైసా ఖర్చు లేకుండా పోలీస్ బందోబస్తూ ఏర్పా టవుతుంది. మంత్రులకి ఫ్రీ పాస్ లుంటాయి కాబట్టి వాళ్ల ప్రయాణాలకి నాకు ఒక్క పైసా కూడా ఖ ర్చవదు. అవకపోగా వాళ్లు రావడం బట్టి నా సభలకి నిండుదనం, హుందాతనం కూడా వస్తాయి. వాళ్ల పరిచయాల వల్ల నాకు రేపో మాపో కళా ప్రపూర్ణ బిరుదు కూడా రాబోతుంది."

"నాయక్ చెప్పిందాన్ని యథాతథంగా చెప్పడానికి ప్రయత్నిస్తున్న వర్మ చెప్పడం ఆపుచేసి, తన ఆవేశాన్ని తమాయించుకోవడానికి, సిగరెట్ వెలిగించాడు. శ్రీనూ తన ఆత్రాన్ని ఆపుకోలేక - "ఆయన చెప్పవలసింది ఆయన చెప్పేడు, మరి... మీ రేం చెప్పేరు?" అన్నాడు.

"నాకు తెల్సిందొక్కటే మార్గం. అది - కష్టపడి పనిచేయడం! నేను అర్హతలున్న వాళ్లతో పోటీ పడగలను కానీ, అడ్డదార్లో అందలమెక్కిన వాళ్లతో పోటీపడనని చెప్పేను. దేవుణ్ణి ఎంతో మంది భక్తులు ఆరాధిస్తారు. ఆరాధించిన ప్రతీ వాడినీ దేవుడు అనుగ్రహించడు. అలాగని అనుగ్రహానికి నోచుకోని భక్తులంతా దేవుణ్ణి వదిలేస్తున్నారా? దేవుడికి బదులు దెయ్యాన్ని పిశాచాల్ని ఉపాసన చేసి క్షుద్రులుగా మారి తమ కోర్కెలు నెరవేర్చుకుంటున్నారా? నాకు వృత్తే దైవం. ఆ దైవం నన్ను అనుగ్రహించి, అందల మెక్కించలేదని, నేను పిశాచాన్ని పూజించే క్షుద్రుణ్ణి కాలేననీ ఖచ్చితంగా చెప్పేను."

వర్మ నెర్వస్ అవుతున్నాడని, వణుకుతున్న అతని చేతి వేళ్లే చెప్తున్నాయి.

"ఇప్పుడు చెప్పరా శ్రీనూ! న న్నా కళా ప్రపూర్ణుడి అభినందన సభకి వెళ్లమంటావా? నువ్వు నడుస్తున్న రెండో మార్గమే మంచిదని ఒప్పుకోమంటావా కష్టాని కి ఫలితం దక్కని ప్రతీ మనిషి రంగనాయకుల్లాగే అడ్డదారి తొక్కి, చెడ్డ పనులు చేసి, ధనవంతుడు, కీర్తిమంతుడూ కావాలని ఉపన్యాసం ఇ మ్మంటావా? చెప్పరా చెప్పు"

వర్మ ఉద్వేగంగా అడుగుతున్న ప్రశ్నలకి శ్రీను నోరు విప్పకుండానే తన సమాధానాన్ని తెలియజేస్తూ చేతిలో ఉన్న ఆహ్వాన పత్రాన్ని ముక్కలు ముక్కలుగా చింపేశాడు. నేల మీద చిందరవందరగా పడిన ఆ కాగితం ముక్కలే శ్రీనివాస వర్మకి సమాధానం చెప్పాయి.